క్లుప్తంగా

సొసైటీ చైర్మన్ పదవికి భాస్కరబాబు రాజీనామా

రౌతులపూడి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) చైర్మన్ పదవికి సోమరౌతు భాస్కర వెంకన్నదొర (భాస్కరబాబు) రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం రాజీనామా లేఖను సొసైటీ సీఈఓ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి అందజేశారు. జిల్లా సహకార అధికారి, డివిజినల్ సహకార అధికారి, డీసీసీబీ సీఈఓ, డీసీసీబీ అన్నవరం బ్రాంచ్‌లకు రాజీనామా ప్రతులను పోస్టల్‌లో పంపించినట్లు ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



తపోవనంలో దత్తత్రేయునికి పూజలు చేస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో మంగళవారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దత్తత్రేయుడికి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పూలతో విశేషంగా అలంకరించి, పూజలు చేశారు. గోపూజ, గోఆరాధన నిర్వహించి, దత్త జయంతి విశిష్టతను భక్తులకు వివరించారు.

గండేపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం దత్త జయంతిని ఘనంగా నిర్వహించారు. తాళ్లూరు, గండేపల్లిలో దత్తాత్రేయ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



ఏలేశ్వరంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఏలేశ్వరం: హనుమద్వ్రతం వేడుకల్లో భాగంగా పట్టణంలో వృద్ధులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక హనుమాన్ జంక్షన్‌లో స్వామి వారి ఆలయం వద్ద సుమారు 150 మంది వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కంచర్ల సత్యనారాయణ మాట్లాడుతూ హనుమద్వ్రత ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులు పాటు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో కంచర్ల మానస, పిరాట్ల రాజా, కంచర్ల రమేష్, మండ వీరేష్, మండ జ్యోతి, మజ్జి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల కారణంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ అశోక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి, రాజుపాలెం, కామరాజుపేట, గంగంపాలెం, ఠాకూరుపాలెం, సూదికొండ, జగన్నాథపురం, శివరామపట్నం, మల్లవరం, భూపతిపాలెం గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

అన్నసమారాధన

జగ్గంపేట: స్థానిక టవర్ కాలనీ సమీపంలోని ధనసత్తమ్మతల్లి ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు వైభోగుల కొండబాబు, పాలిక వీరబాబు, తాతిన విజయ్, సిమ్మ ముత్యాలు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారికి సారె సమర్పణ



ధర్మవరంలో గోదాదేవికి సారె సమర్పిస్తున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. గ్రామంలోని అద్దేపల్లి రాజారత్నకుమారి నివాసం వద్ద గోదాదేవికి ప్రత్యేక పూజలు చేసి మహిళలు వివిధ రకాల వంటకాలు, స్వీట్లు, పండ్లు, పూలతో కూడిన సారెను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

సమస్యలు పరిష్కరించాలి

గోకవరం: లవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు. గోకవరం శివారులో దేవీపట్నం ఆర్అండ్ఆర్ కాలనీవాసులు చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలన్నారు. అనంతరం నిర్వాసితులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



తొండంగి జెడ్పీ హైస్కూల్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు



జగ్గంపేటలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



మురారిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



బిళ్లనందూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభం
- గ్రామాల్లో సందడి వాతావరణం



ఒమ్మంగిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే క్రీడాకారులతో కలిసి షటిల్, వాలీబాల్ ఆడి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్తిపాడు మండల వ్యాప్తంగా ఏడు వేల మంది క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొంటారన్నారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. క్రీడాకారులు ప్రతిభ కనబరిచిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, మండల యూత్ లీడర్ రామిశెట్టి బులిరామకృష్ణ, సొసైటీ చైర్మన్లు గొంతిన సురేష్, కొప్పన గంగారావు, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

శంఖవరం: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని నెల్లిపూడిలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, ఎంఈఓ ఎస్‌వీ రమణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను, ఎంపీటీసీ నడిగట్ల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

తొండంగి: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. తొండంగి జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం-ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందన్నారు. గ్రామీణ యువత ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పసుపులేటి సతీష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు అంగుళూరి సుశీలరాణి, దడాల విజయ్ కుమార్, సర్పంచ్ సోమాల ప్రసాద్, పాఠశాల పీఎంసీ చైర్మన్ రౌతు శివ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: క్రీడలు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదం చేస్తాయని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ బండారు రాజా అన్నారు. జగ్గంపేటలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం వారు ప్రారంభించారు.

కిర్లంపూడి: మండలంలోని 26 గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం హట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వీరవరం జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, గ్రామ సర్పంచ్ అంబటి బుజ్జమ్మ క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. గ్రామీణ క్రీడాకారులు ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ దాసరి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ఏలేశ్వరం: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ చిన్నారావు సూచించారు. మండలంలోని పేరవరంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత భేరి అరవిందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలవ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లోనూ మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను తహసీల్దార్ బి.భీమారావు ప్రారంభించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తుని రూరల్: మండల వ్యాప్తంగా ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వి.కొత్తూరులో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎస్.అన్నవరంలో తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, కుసనం దొరబాబు పోటీలను ప్రారంభించారు. సచివాలయాల స్థాయిలో పదిరోజుల పాటు క్రీడా పోటీలు జరుగుతాయని ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు.

తుని: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు అన్నారు. పట్టణంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. పట్టణంలోని ఒకటో వార్డులో నిర్వహించిన వివిధ పోటీలకు భారీగా మహిళలు, యువత హాజరయ్యారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వి.కొత్తూరులో క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ డాక్టర్ రాము

గండేపల్లి: మండలంలోని మురారిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీపీ చలగళ్ల దొరబాబు ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, ఎంపీడీఓ రామన్ తదితరులు పాల్గొన్నారు.

కోటనందూరు: మండల వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బిళ్లనందూరు, ఇండుగపల్లిలో సర్పంచులు కుంచే సత్యవతి, సుర్ల రాంబాబులతో కలిసి ఎంపీపీ లగుడు శ్రీనివాసు పోటీలను ప్రారంభించారు. అల్లిపూడిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు పోటీలను ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు క్రీడాకారులతో కలిసి ఆటలాడి వారిని ఉత్సాహ పరిచారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండల వ్యాప్తంగా ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని 20 సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలను ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది పోటీలను పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- కేఈ చిన్నయ్యపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం



కేఈ చిన్నయ్యపాలెంలో మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని కేఈ చిన్నయ్యపాలెంలో మంగళవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడ్ల సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కరక అప్పలనాయుడు, లాలం వెంకటరమణ, పార్టీ యూత్ కన్వీనర్ బండి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుని నుంచి వాడపల్లికి బస్సు సర్వీసు

తుని: తుని ఆర్టీసీ డిపో నుంచి వాడపల్లికి బస్సు సర్వీసు నడుపుతున్నట్టు డిపో మేనేజరు కిరణ్ కుమార్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 4.30 గంటలకు సర్వీస్ నంబర్ 98382 బస్సు బయలు దేరుతుందన్నారు. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టికెట్లు రిజర్వేషన్ పొందవచ్చన్నారు. తుని నుంచి రాజమహేంద్రవరం మీదుగా వాడపల్లి క్షేత్రానికి బస్సు చేరుకుంటుందన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మానసిక ప్రశాంతతతో ఒత్తిడి దూరం

తుని: మానసిక ప్రశాంతతతో ఒత్తిడిని జయించవచ్చని సైకాలజిస్టు సీహెచ్ లోవరాజు అన్నారు. తుని రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు మానసిక ఒత్తిడిని అధిగమించడం ఎలా ? అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లోవరాజు మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డాక్టర్ కోమలి మాట్లాడుతూ కౌమార దశలో వచ్చే సమస్యలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, రోటరీక్లబ్ తుని శాఖ అధ్యక్షుడు వర్మ, కార్యదర్శి కిశోర్‌రెడ్డి, మంగరాజు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చార్లెస్ బాబేజ్ జయంతి

ఏలేశ్వరం: కంప్యూటర్ పితామహుడు చార్లెస్ బాబేజ్ జయంతి వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక మార్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకుడు అడపా దుర్గారావు ఆధ్వర్యంలో బాబేజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ కనిపెట్టి బాబేజ్ ప్రపంచానికి గొప్ప పరిజ్ఞానాన్ని అందించారన్నారు. లండన్‌లో జన్మించిన బాబేజ్ కంప్యూటర్ సాంకేతిక రంగానికి చేసిన సేవలు అపూర్వమన్నారు. కంప్యూటర్ ద్వారా నేడు కోట్లాది మంది ఉపాధి పొందుతున్నారన్నారు. నేటి యువత బాబేజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోరాడ రాజు, వానపల్లి సాయిదుర్గ, నమ్మి అన్నపూర్ణ, రమణం సత్య, అనూష, సాయిమనోజ్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



అన్నవరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

అన్నవరం: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. అన్నవరంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, రైతు భరోసా కార్యాలయం, హెల్త్ సెంటర్‌లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రతి గ్రామంలోనూ సచివాలయాలు, రైతు భరోసా సెంటర్లు, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్నవరం సర్పంచ్ ఎస్.కుమార్ రాజా, ఉప సర్పంచ్ బొబ్బిలి వెంకన్న బాబు, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, రాజాల చిట్టిబాబు, బొమ్మిడి సత్తిబాబు, వీర్ల సూరిబాబు, అరిగెల దొరబాబు, పలివెల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



ఎస్.అన్నవరంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నవరం: పౌర్ణమిని పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి మంగళవారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 3 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మొత్తం 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి సుదర్శన హోమం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం సుదర్శన హోమం నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అర్చకులు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి వేదపండితులు మహాచండీ హోమం నిర్వహించారు. జగన్నాథగిరి కాలనీలో సరస్వతీ విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.

వంగవీటి మోహనరంగాకు ఘన నివాళులు



ఏలేశ్వరంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాపు యూత్ సభ్యులు

ఏలేశ్వరం: కాపు నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతిని పట్టణంలో మంగళవారం నిర్వహించారు. రంగా యూత్ ఆధ్వర్యంలో స్థానిక వైఆర్‌పీ క్వార్టర్స్ వద్ద గల రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు రంగా చేసిన సేవలను కొనియాడారు. రంగా ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపు శ్రీనివాస్, గట్టెం వెంకటరమణ, రెడ్డి రాజు, గూడపాటి శేఖర్, గోళ్ల విజయ్, గొల్లపల్లి త్రినాథ్, వంశీకృష్ణ, గంపా చరణ్ తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: గ్రామంలో మంగళవారం వంగవీటి రంగా వర్ధంతిని నిర్వహించారు. కాపు నాయకులు రంగ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కరణం సుబ్రహ్మణ్యం, కూరగాయల వెంకటరమణ, కర్రి రాము, గవరసాని సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పైడికొండలో వై ఏపీ నీడ్స్ జగన్



పైడికొండలో పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

తొండంగి: పేదల జీవన ప్రమాణస్థాయి మరింత పెరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మండలంలోని పైడికొండలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను సీఎం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ కన్వీనర్ బద్ది నూకరాజు, పార్టీ నాయకులు అంగుళూరి సుశీల, దడాల విజయ్‌కుమార్, సర్పంచ్ నరిశే దుర్గ, నరిశే స్వామి తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



అద్దరిపేటలో కాలిపోయిన తాటాకిల్లు

తొండంగి: మండలంలోని అద్దరిపేటలో మంగళవారం తాటాకిల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన మైలపల్లి సత్యనారాయణ, అతని ముగ్గురు కుమారుల కుటుంబాలు ఒకే తాటాకింట్లో నివాసం ఉంటున్నాయి. మత్స్యకార కుటుంబం కావడంతో మగవారంతా వేటకు వెళ్లారు. సత్యనారాయణ పెద్ద కోడలు మైలపల్లి రాజేశ్వరి, చొక్కా వరలక్ష్మి ఇంట్లో ఉండగా అగ్నిప్రమాదం సంభవించింది. ఇంటిపై కప్పు నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు నీటి బిందెలతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఇంట్లో గృహోపకరణాలతో పాటు వేటకు వినియోగించే వలలు, బోటు ఇంజిన్, కొంత నగదు కాలిబూడిదయ్యాయి. తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు వీఆర్వో రామకృష్ణ, ఇతర సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. తక్షణ సహాయంగా బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. అగ్నిప్రమాదానికి విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌గా కారణంగా అనుమానం వ్యక్తం చేశారు. మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు బాధితులను వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, సర్పంచ్ కోడా వర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి నిత్యావసరాలు, ఆర్థిక సహాయం అందించారు.

రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏఓ చంద్రశేఖర్ అధ్యక్షతన రైసు మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం నిర్ధారించిన కనీస గిట్టుబాటు ధర రైతులకు దక్కేలా చూడాలన్నారు. సివిల్ సప్లయి డిస్ట్రిక్ట్ మేనేజర్ పుష్పమణి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు రైసు మిల్లర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైసు మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కొయ్యా మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, ఏఎంసీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, మండలాధ్యక్షుడు సుర్ల రాజు, ఏఈఓ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

100 రోజులు పని కల్పించాల్సిన బాధ్యత మేట్లదే



శిక్షణలో మేట్లకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తుని రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు 100 రోజులు పని దినాలు కల్పించడంలో మేట్లు కీలకపాత్ర వహించాలని ఏపీఓ పసుపులేటి నారాయణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆరు గ్రామాల పరిధిలో ఉపాధి మేట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నికుటుంబాలకు వందరోజులు పని కల్పించాలన్నారు. రోజ్‌గార్ దివాస్ కార్యక్రమాలు, గ్రూపు సభ్యుల డిమాండ్ ఎఫ్ఏలకు తెలియజేయడం, కొలతల ప్రణాళిక, తదితర అంశాలపై మేట్లు అవగాహన పెంచుకోవాలన్నారు. మొదటి రోజు ఎస్.అన్నరవరం, ఎన్.సూరవరం, కొలిమేరు, కేఓ.మల్లవరం, కొత్తూరు, అటికెవానిపాలెం గ్రామాల మేట్లు శిక్షణలో పాల్గొన్నారు.

షెడ్యూల్ ఇలా..

27న డి.పోలవరం, రేఖవానిపాలెం, అగ్రహారం, వల్లూరు, చామవరం, వెంకటనగరం, 28న కుమ్మరిలోవ, హంసవరం, చేపూరు, లోవకొత్తూరు, రాపాక, రాజుపేట, 29న తాళ్లూరు, తేటగుంట, హెచ్.కొత్తూరు, దొండవాక, తి.తిమ్మాపురం మేట్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఏపీఓ నారాయణరావు తెలిపారు. టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి మేట్లకు శిక్షణ

రౌతులపూడి: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం నుంచి ఉపాధి హామీ మేట్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.గోవింద్ మంగళవారం తెలిపారు. మండలంలోని 26 పంచాయతీల్లో ఉపాధి హామీ మేట్లకు రోజుకు 40 మందికి శిక్షణ ఇస్తారన్నారు. మండలంలో రిజిస్టర్ అయిన ఉపాధి మేట్లు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు.